www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 29 సెప్టెంబర్ 2023



పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి

పోరుమామిళ్ల టౌన్ : పారిశుద్ధ్య కార్మికులు ప్రజలకు అందిస్తున్న సేవలు ఎనలేనివని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రంగసముద్రం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను బ్లేజర్ (బ్రయాన్) ఆశ్రమంలో స్వచ్ఛ హి సేవలో భాగంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్యం మెరుగుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. రంగసముద్రం పంచాయతీలో సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, సెక్రటరీ, సిబ్బంది స్వచ్ఛత పై ప్రత్యేక దృష్టి సారించి పని చేస్తున్నారని అభినందించారు. విజయవాడలో ఈ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపిపిలు సి.ఎం. బాషా, చెన్నురాజశేఖర్, సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కల్లూరు రమణారెడ్డి, డిఎల్‌పిఒ రమణారెడ్డి, ఎంపిడిఒ వర ప్రసాద్‌రావు, కార్యదర్శి, ఎంపిటిసిలు, ఉప సర్పంచ్ రుద్రవరం ప్రసాద్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

బది'లీల'లు

ఆర్‌డిలో మాడిఫికేషన్ ఉత్తర్వుల జోరు

డిఎంఒలో నలుగురు ఎంపిహెచ్ఇఒలు

143 జిఒ అమలులో అలసత్వం



ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో మాడిఫికేషన్ బదిలీల పర్వం కొనసాగుతోంది. ప్రభుత్వం గతంలో జారీ చేసిన 143 జిఒ ప్రకారం పిహెచ్‌సి కేంద్రాల్లో ఒకే రకమైన పోస్టులు ఉండకూడదని నిర్ణయించిన సంగతి తెలిసిందే. గత నెల 24, 25వ తేదీల్లో రీజినల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన పిహెచ్‌సి కేంద్రాల్లోని అన్ని కేడర్లకూ రీ డిస్ప్లేస్ మెంట్ చేశారు. తాజాగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ అమరావతి యంత్రాంగం డిఎంహెచ్ఒ, జిల్లా మలేరియా కార్యాలయాలకు ఇద్దరు చొప్పున ఎంపిహెచ్ఇఒలను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను మానిటరింగ్ చేయడానికి ఇద్దరు ఎంపిహెచ్ఇఒలను, జిల్లా మలేరియా కార్యాలయంలో ఫీల్డ్, రిజర్వ్ నిమిత్తం ముగ్గురు ఎంపిహెచ్ఇఒలను నియమించింది. వీరిలో ఇద్దరిని మైదుకూరు, పోరుమామిళ్ల ప్రాంతాల ఫీల్డ్ నిమిత్తం, రిజర్వ్ నియమిత్తం ఒకరిని కేటాయించారు. గత నెలలో నిర్వహించిన రీ డిస్ప్లేస్‌మెంట్ కౌన్సిలింగ్‌లో జోనల్ అధికారి జిల్లా మలేరియా కార్యాలయంలో ముగ్గురు ఉండగా మరో నలుగురు ఎంపిహెచ్ఇఒలను కేటాయించింది. ఈలెక్కన జిల్లా మలేరియా కార్యాలయంలోనే ఏడుగురు ఎంపిహెచ్ఇఒలు ఉన్నట్లు లెక్క తేలుతోంది. 143 జిఒ ప్రకారం రీ డిస్ప్లేస్ మెంట్ కౌన్సెలింగ్ ముగిసి నెల రోజులు గడిచిన తరువాత మూడు పిహెచ్‌సి కేంద్రాల్లో ఖాళీలను ఉంచి జిల్లా మలేరియా అధికారి కార్యాలయానికి బదిలీ చేయడంలోని మతలబేమిటో తెలియడం లేదు. కడప -అనంతపురం జిల్లా సరిహద్దు పిహెచ్‌సి నుంచి ఒకరిని, మిగిలిన ఇద్దరిని అన్నమయ్య, అనంతపురం జిల్లాల పిహెచ్‌సి కేంద్రాల నుంచి బదిలీ చేయడం గమనార్హం. ఇటువంటి బదిలీలతో 143 జిఒను అపహాస్యం చేసినట్లు అవుతోందనే వాదన వినిపిస్తోంది. పిహెచ్‌సిల్లో ఉండాల్సిన ఎంపిహెచ్ఇఒలను నిబంధనలకు వ్యతిరేకంగా జిల్లా మలేరియా అధికారి కార్యాలయానికి సుమారు నలుగురిని కేటాయించడం గమనార్హం. వీరిలో ఒకరు రాష్ట్రానికి చెందిన ఉన్నతాధికారికి సన్నిహితంగా వ్యవహారాల్ని చక్కబెడుతున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపిహెచ్ఇ రీ డిస్ప్లేస్‌మెంట్ కింద అనంతపురం జిల్లాకు వెళ్లాల్సి ఉండగా మళ్లీ జిల్లా మలేరియా కార్యాలయం (డిఎంఒ)లో నియమితులు కావడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఆర్‌డిని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

అసెంబ్లీ సాక్షిగా జిపిఎస్ అమలు దుర్మార్గం

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సాక్షిగా సిపిఎస్ ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిపిఎస్ ప్రతులను యుటిఎఫ్ భవన్ ఎదుట నాయకులతో కలిసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని మరిచి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకపోగా ప్రస్తుతం ఉన్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు గ్యారెంటీ లేని జిపిఎస్ విధానాన్ని అమలుపరిచేందుకు శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. జిపిఎస్ విధానం సిపిఎస్ కన్నా ఎక్కువగా నష్టాన్ని చేకూరుస్తుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ ప్రభుత్వంలో భాగమే అన్న విషయాన్ని మరిచి వారి ఆకాంక్షలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలోని ప్రభుత్వాలకు తగదన్నారు. ప్రతి ఉద్యోగి 30 సంవత్సరాలకు పైగా ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తారని, అలాంటి ఉద్యోగి విరమణ పొందిన అనంతరం గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవకాశం ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉండి ప్రజాసంక్షేమాన్ని కోరుకునే ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రికి కనువిప్పు కలిగి వచ్చే ఎన్నికలలోపు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి తీరాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో ఉద్యోగ ఉపాధ్యాయులు ఏకమై ఉద్యమ కార్యాచరణ చేపట్టి ఈ ప్రభుత్వం దమన నీతిని ఎండ కడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు శ్రీనివాసులు, నాగరాజు, అనిల్, సుజిత్, సిద్దయ్య, మజ్జారి చెన్నకేశవులు, బాబు, శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.



కడప యుటిఎఫ్ భవనం వద్ద జిపిఎస్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

జమ్మలమడుగు రూరల్ : ప్రభుత్వాలు తీసుకొచ్చిన సిపిఎస్, జిపిఎస్‌లు ఉద్యోగుల పాలిట ఉరితాళ్లు లాంటివని వాటి వల్ల ఉద్యోగులకు నష్టం తప్ప ఎటువంటి ఉపయోగం ఉండదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు జిపిఎస్‌కు వ్యతిరేకంగా ఎస్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.విద్యాసాగర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు యాదవ్ మాట్లాడుతూ తక్షణమే ఈ జిపిఎస్ బిల్లును వెనక్కి తీసుకొని దాని స్థానంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమైన పాత పెన్షన్ విధానాన్ని తీసుకు రావాలని లేనిపక్షంలో దశల వారి పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి విద్యాసాగర్, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నాయకులు దస్తగిరి, లక్ష్మీ చౌదయ్య, మునిశేఖర్, వెంకటేష్, రాఘవ, హుస్సేన్ పీరా, కే కృష్ణయ్య, రమణమూర్తి, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

అంగళ్లు, పుంగనూరు కేసుల్లో 72 మంది విడుదల

కార్యకర్తలకు స్వాగతం పలికిన టిడిపి నాయకులు

టిడిపి అధికారంలోకి రావడం చారిత్రాత్మక అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పుంగనూరు పర్యటనలో జరిగిన అల్లర్ల సంఘటనలో అన్నమయ్య జిల్లా అంగళ్లు, పుంగనూరు టిడిపి చెందిన 72 మంది కార్యకర్తలు గురువారం బెయిల్‌పై విడుదలయ్యారు. వారికి టిడిపి జిల్లా నాయకులు కడప సెంట్రల్ జైలు ప్రధాన గేటు వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అక్రమ కేసులతో జైలుకు వెళ్లామని, బాధపడే కన్నా రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమన్న లక్ష్యంగా వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మరింత పోరాటం చేయాలన్నారు. 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమానికి పాటుపడిన, టిడిపి అధినేత చంద్రబాబును నిరాధారమైన అవినీతి ఆరోపణలతో అరెస్టు చేసి జైలుకు పంపిన జగన్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకలించే వరకు తెలుగుదేశం పార్టీ కుటుంబం విశ్రమించకూడదని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం చారిత్రాత్మక అవసరమని అన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి మాట్లాడుతూ ఎన్ని కుట్రలతో అరెస్టు చేసి జైలుకు పంపిన నిర్దోషులుగా బయటకి రావడం జరుగుతుందన్నారు. చంద్రబాబు జైలు నుంచి బయటకు వస్తారని రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. న్యాయమే గెలుస్తుంది అన్నది జగమెరిగిన సత్యం అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దుర్మార్గానికి నిదర్శనం, అక్రమ కేసులతో టిడిపి నాయకులను జైళ్లకు పంపడమే అన్నారు. కేసులతో భయపెట్టి తిరిగి గెలవాలన్నదే వైసిపి నేతల లక్ష్యమన్నారు. ఇప్పటికే వైఇసపి ప్రజా వ్యతిరేక పాలనతో ప్రజల్లో అభాసుపాలైందని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు పట్టడం కడతారని అన్నారు. ఎన్ని కేసులు పెట్టిన భయపడే పరిస్థితి లేదని వారు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయం : డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప

ప్రముఖ రచయిత, కవి, సాహితీకారుడు, నవయుగ చక్రవర్తి గుర్రం జాషువా సేవలు ఎనలేనివని డిఆర్ఒ గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన హాల్‌లో ప్రముఖ నవయుగ కవి, సాహితీకారుడు జాషువా జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి డిఆర్ఒ గంగాధర్ గౌడ్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1895వ సంవత్సరం సెప్టెంబర్ 28న గుంటూరు, ప్రస్తుతం పల్నాడు జిల్లా వినుకొండ మండలం చాత్రగడ్డపాడులో గుర్రం వీరయ్య, లింగమ్మ దంపతులకు జన్మించారన్నారు. చిన్నతనం నుంచి జాషువాలో సృజనాత్మక శక్తి ఉండేదని, బొమ్మలు గీయడం, పాటలు పాడడం చేసేవాడిని, ఆయన 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు రాశారన్నారు. రుక్మిణి కల్యాణం, కోకిల, ధ్రువ విజయం, గబ్బిలం, ఫిరదౌసి, ఖండకావ్యాలు, తదితర అనేక రచనలు చేశాడని, కవితా విశారద, కవికోకిల, నవయుగ చక్రవర్తి, విశ్వకవి సామ్రాట్ గా బిరుదులు పొంది ప్రసిద్ధులైనారన్నారు కార్యక్రమంలో సిపిఒ వెంకట్రావు, జిల్లా టూరిజం అధికారి ఎస్. మల్లికార్జున, డిసిఒ సుభాషిణి, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా. శారదమ్మ, కలెక్టరేట్ ఎఒ విజయ్ కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ జ్ఞానేంద్ర, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో..

కడప అర్బన్ : కడప యుటిఎఫ్ భవన్ లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో జాషువా జయంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆధునిక కవి, పండితులు మజ్జారి చెన్నకేశవులు జాషువా రచనలు - జీవితం - సామాజిక దృక్పథంపై అనే అంశంపై ప్రసంగించారు. పాములకు పాలు, చీమలకు పంచదార పెట్టే పవిత్ర భారతదేశంలో పేదవాడికి ఒక్క మెతుకు కూడా అన్నం విదల్చక పోవడాన్ని గుర్రం జాషువా తీవ్రంగా నిరసించారని చెప్పారు. చాతుర్ వర్ణ వ్యవస్థలో భరతమాతకు పుట్టిన అయిదవ సంతానం నిమ్న జాతులని ఆనాటి వారి పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు తెలిపారు. జాషువా రచనల స్ఫూర్తిని ప్రతి ఒక్కరు పొంది అణగారిన వర్గాలకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు సుజిత్, శ్రీనివాసులు, అనిల్ కుమార్, బాబు, సిద్దయ్య, శ్రీకాంత్,నాగరాజు పాల్గొన్నారు.



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిఆర్ఒ, అధికారులు



కడప నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న డిప్యూటీ సిఎం, ముస్లిములు

ఘనంగా మిలాదున్ నబీ వేడుకలు

ప్రజాశక్తి- కడప అర్బన్

భారతదేశం మతసామరస్యానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త సల్లేవుల్లాహు వసల్లం అడుగుజాడల్లో నడవాలని ఉప ముఖ్య మంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. గురువారం మహమ్మద్ ప్రవక్త సల్లే వుల్లాహు వసల్లం జయంతిని మిలాదున్‌నబీ వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతులు సుఖ శాంతులతో సుభిక్షంగా ఉండాలని చెప్పారు. తొలుత ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల టౌన్ :** మిలాదున్ నబీ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ప్రార్థన నిర్వహించారు. అనంతరం పోరుమామిళ్లలోని మహబూబ్ నగర్ నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కబా నమూనాను వాహనం మీద ఊరేగింపుగా తీసుకుని వెళ్లారు. ఈ ర్యాలీలో ఇస్లాం మత పెద్దలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విజయనగరం జట్టు విజయం

కడప : కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-23 ఇంటర్ జోనల్ మెన్ వన్డే క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా గురువారం వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టుపై ఆరు వికెట్ల తేడాతో విజయనగరం జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎం.వంశీకృష్ణ బ్యాటింగ్లో అద్భుతంగా రాణించి 122 పరుగులు (సెంచరీ) చేశాడు. విజయనగరం జట్టులోని వై. వాసు 4, టి.దీపు భార్గవ్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 255 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన విజయనగరం జట్టు 49.1 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 260 పరుగులు చేసి ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని జి.ఎస్.పి తేజ 85, రవి కిరణ్ 88 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని సిద్ధార్థ రెండు వికెట్లు తీసుకున్నాడు.

కె ఎస్ ఆర్ ఎమ్ క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టుపై 51 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 49.2 ఓవర్లలో 268 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతరం 269 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 45.2 ఓవర్లలో 217 పరుగులు చేసి ఆల్ అవుట్ అయి ఓటమి చెందింది. ఆ జట్టులోని ఎస్. వి. రాహుల్ 80 పరుగులు చేశాడు. నెల్లూరు గట్టులోని ఎన్. మాధవ్ 4, సాకేత్ రామ్ 3 వికెట్లు తీసుకున్నారు.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్ లో కృష్ణ జట్టుపై ఏడు వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన క్రిష్ణా జట్టు 20.5 ఓవర్లలో 79 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని విశాల్ 23 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని చెన్నారెడ్డి 5, విజయ్ భావేంద్ర 2, ఇస్మాయిల్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 80 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 14.3 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.



కొరటాలకు నివాళులర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

'కొరటాల' జీవితం నేటితరానికి ఆదర్శం

ప్రజాశక్తి - కడప అర్బన్

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) పొలిట్ బ్యూరో సభ్యులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కొరటాల సత్యనారాయణ జీవితం నేటి తరానికి ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, పూర్వపు జిల్లా కార్యదర్శి బి. నారాయణ అన్నారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ అధ్యక్ష తన కొరటాల సత్యనారాయణ శతజయంతి సభ నిర్వహించారు. ముందుగా కొరటాల చిత్రపటానికి బి. నారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1923, సెప్టెంబర్ 24న గుంటూరు జిల్లా అమృతలూరు మండలం పేపర్ గ్రామంలో బుచ్చయ్య, శేషమ్మ దంపతులకు జన్మించారని పేర్కొన్నారు. కొరటాల పుట్టిన నేపథ్యం భూస్వామి కుటుంబమైన నిత్యం పేదల పక్షాన కష్టజీవులతో మమేకమై పనిచేశారని తెలిపారు. గుంటూరు ఏసీ కళాశాలలో చదివేటప్పుడు విద్యార్థి సమస్యలపై పోరాటంలో ముందుకు వచ్చారని చెప్పారు. ఆ తర్వాత చదువుకు స్వస్తి చెప్పి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సుందరయ్య, బసవ పున్నయ్య వంటి నాయకులతో కలిసి పని చేశారని పేర్కొన్నారు. గ్రామీణ పేదలు, కష్టజీవుల బాధలు తెలుసుకుని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు తీసుకుని వారికోసం పోరాటం నిర్వహించారని తెలిపారు. ప్రధానంగా పత్తి రైతుల పోరాటాన్ని నిర్వహించారని చెప్పారు. చిన్న, పెద్ద అనేటువంటి లేకుండా కార్యకర్తలతో 'అరే బాబు' అంటూ ఆప్యాయంగా పలకరించే కొరటాల నేటి తరానికి ఎంతో ఆదర్శమన్నారు. కొరటాల ప్రజా ఉద్యమాలు చేస్తూనే ప్రజా సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేశారని తెలిపారు. రెండుసార్లు శాసనసభ సభ్యులుగా పని చేశారని చెప్పారు. ఉమ్మడి కడప జిల్లా పెనగలూరు మండలంలో కరువు సహాయక చర్యలు భాగంగా అంబలికేంద్రాలు చేపట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి. ఆర్. వి. ప్రసాద్, సిపిఎంఎల్ పార్టీ నాయకులు రాము, బీఎస్పీ పార్టీ జిల్లా నాయకులు గుర్రప్పా, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సత్తార్, లోక్ సత్తా పార్టీ నాయకులు దేవరకృష్ణ, ఆమ్ ఆ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్ వితరణ


చింతకొమ్మదిన్నె : మదర్ థెరీసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని కృష్ణాపురం దగ్గర ఉన్నటువంటి ఆశ నిలయానికి సీలింగ్ ఫ్యాన్స్, శానిటరీ ప్యాడ్స్‌ను దాతలు దర్బర్ వల్లీ వారి భార్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల మధ్య గడపడం చాలా సంతోషకరమన్నారు. ఆశా నిలయానికి ఏ ఏదైనా అవసరమైతే తాము సాయం చేస్తామని చెప్పారు. మదర్ థెరీసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటురు విజయ్ కుమార్ మాట్లాడుతూ దాతల సహకారంతో కార్యక్రమం నిర్వహించామని దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిస్టర్ జ్యోతిషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్ మరణం బాధాకరం

కడప అర్బన్ : భారత హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్(98) వృద్ధాప్య సమస్యలతో గురువారం చెన్నైలోని తన నివాసంలో తుదిశ్వాస విడవడం బాధాకరమని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, కమిటీ సభ్యులు పారుక్ హుస్సేన్, మహబూబ్ తార గురువారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. స్వామినాథన్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. స్వామినాథన్ 1925, ఆగస్టు 7న అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని కుంభకోణంలో జన్మించారని పేర్కొన్నారు. ఆయన తండ్రి ఎం.కె. సాంబశివన్ సర్జన్ కాగా, మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన తర్వాత స్వామినాథన్ కూడా తండ్రి బాటలోనే మెడికల్ స్కూల్లో చేరారని తెలిపారు. 1943లో బెంగాల్‌లో చోటు చేసుకున్న క్షామాన్ని చూసిన స్వామినాథన్ తన మనసు మార్చుకుని వ్యవసాయ పరిశోధనల వైపు అడుగులు వేశారని పేర్కొన్నారు. త్రివేండ్రంలోని మహారాజా కళాశాలలో జువాలజీ నుంచి డిగ్రీ పట్టా పొందారని తెలిపారు. వ్యవసాయరంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం నియమించిన కమిటీలో స్వామినాథన్ కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఇలాంటి మహా వ్యక్తి లేకపోవడం వ్యవసాయ రంగానికి తీరని లోటని తెలిపారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు **ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో..** ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతి బాధాకరమని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాల కృష్ణయ్య, బి.దస్తగిరి రెడ్డి అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో విచారాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహార వృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు ఈయన ఎంతో కృషి చేశారన్నారు. తన పరిశోధనలతో మేలైన వరి వంగడాలను సృష్టించారని తెలిపారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

పోరుమామిళ్ల టౌన్ : విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 30న జరగనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం చలో విజయవాడ పోస్టర్లను స్థానిక బిసి హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని అన్ని జిల్లా కేంద్రాలలో చలో కలెక్టరేట్ కార్యక్రమాలు నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు చేత విద్యార్థి సంఘ నాయకులను, విద్యార్థులను బలవంతంగా అరెస్ట్ చేసి అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. సమస్యల పరిస్కారం కోసం విద్యార్థులు రోడ్డెక్కితే సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూడటం దారుణమన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నేటికీ గత 6,7 నెలల మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయభాస్కర్, చారి, గురు మోహన్, శేఖర్ , అశ్వంత్, ఓబుల్ రెడ్డి, విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

'కొండూరు'కు ప్రతిభా పురస్కారం

కడప అర్బన్ : జిల్లాకు చెందిన కొండూరు జనార్ధన రాజు జాతీయ ఫోటోగ్రఫీ- 2023 సంవత్సరానికి గాను ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం విజయ వాడలో బహుమతి పొందిన ఫొటోలతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సెర్ప్ సిఇఒ ఎ.ఎండి. ఇంతియాజ్ ఇతర అతిథులతో కలిసి ఆయనకు ఈ అవార్డును అందజేశారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శిగా, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య కార్యదర్శిగా, ఇంటాక్ సీనియర్ సభ్యులుగా జనార్ధన రాజు పలు సం వత్సరాలుగా జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి కోసం చేస్తున్న కృషి తెలిసిందే. వందలాది మందిని పర్యాటక అభిమానులుగా మార్చిన ఆయన రాష్ట్ర ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంఘం గౌరవ అధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి ప్రోత్సాహంతో పాల్గొన్నారు. పంపిన ఫొటోకు జాతీయస్థాయిలో 2023 సంవత్సరానికి గాను పురస్కారం లభించింది. జిల్లా పర్యాటక అభిమానులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కళాకారులు జనార్దన రాజుకు అభినందనలు తెలుపుతున్నారు.



పురస్కారం అందుకుంటున్న కొండూరు జనార్ధనరాజు

సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎపిఎన్ఆర్‌టిఎస్

ప్రజాశక్తి - కడప

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రవాసాంధ్రుల సమ స్యలను ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ ద్వారా పరిష్క రిస్తున్నందుకు గల్ఫ్ ప్రవాసాంధ్రుల తరపున ఎపి ఎన్ఆర్‌టిఎస్ డైరెక్టర్ బి.హెచ్. ఇలియాస్ కృతజ్ఞతలు తెలియజేశారు. యుఎఇ అబుదాబిలో ప్రముఖ పారిశ్రామిక వేత్త మైనర్‌బాబు ఆధ్వర్యంలో గురువారం అబుదాబి ఐక్య తెలుగు క్రిస్టియన్ చర్చి సంఘాల ఫాస్టర్స్ అవగాహన సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మార్గ దర్శకత్వంలో ఎపి ఎన్ఆర్‌టిఎస్ అధ్యక్షులు మేడపాటి వెంకట్ ఆధ్వర్యంలో ప్రవాసాంధ్రులు సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు. ముఖ్య మంత్రి రాష్ట్ర ప్రజలతోపాటు ప్రవాసాంధ్రులు మస్యలు పరిష్కరించడంలో ముందున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఐక్య తెలుగు క్రిస్టియన్ చర్చి సంఘాల అధ్యక్షులు ఫాదర్ శిశిరకుమార్, ఉపాధ్యక్షులు ఫాదర్ అగ్రిపా రాజు, యుఎఇ రీజనల్ కో-ఆర్డినేటర్ ప్రసన్న సోమిరెడ్డి, వైసిపి కన్వీనర్ సయ్యద్ అక్రమం, జాఫర్ అలీ, రెడ్డయ్యరెడ్డి, మోహన్, సయ్యద్ నాసర్, ఎడ్ల ఆనంద్, షేక్. అబ్దుల్లా, అరుణ్‌చక్రి, ఫాదర్ ఆశీర్వాదం, సంపత్ పాల్గొన్నారు.



ప్రవాసాంధ్ర భరోసా బీమా పత్రాలను ఆవిష్కరిస్తున్న ఇలియాస్, సభ్యులు

క్రీడల్లో వేదాస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

వల్లూరు : ఈనెల 21,22, 23 తేదీల్లో నిర్వహించిన గుంటూరు స్పోర్ట్స్ మీట్‌లో వేదాస్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయికి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ ధర్మదీరాజ్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పరుగు పందెంలో ద్వితీయ స్థానం ఎస్. మోహన్ ఎన్. సాయి పుష్పాష్ తృతీయ స్థానంలో నిలిచారన్నారు. లాంగ్ జంప్‌లో బి.తేజేశ్వర్ రెడ్డి ప్రథమస్థానంలో నిలిచారని చెప్పారు. విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై చైర్మన్ శివరామిరెడ్డి, వైస్ చైర్మన్ దిలీప్‌రెడ్డి, కరస్పాండెంట్ దినేష్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యార్థులను అభినందించారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో 'లిటిల్ ఫ్లవర్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్ఎఫ్ బాషా తెలిపారు. అండర్-14 విభాగంలో సారా, రెడియ్య ఎంపికైనట్లు చెప్పారు. అలాగే ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్-17 విభాగంలో వినయ్‌కుమార్, జిశా సాలెస్తా, అండర్-14లో అదిబా, సమీర్, మహమ్మద్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిలో జరిగే క్రీడా పోటీలకు ఎంపికవడంతో సంతోషంగా ఉందన్నారు. పిఇటి జనార్దన్, విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ముబీనా, డైరెక్టర్ అన్వర్ ఉల్ హక్, ఇన్‌చార్జ్ జక్రుల్‌బాషా అభినందించారు.


క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉద్యోగులను నమ్మించి మోసగించిన సిఎం

- పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులను నమ్మించి మోసగించారని పిసిసి మీడియా ఛైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగుల విషయంలో మాట తప్పి, మడమ తిప్పారని ఎద్దేవా చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఉద్యోగులకు మాట ఇచ్చారన్నారు. సకాలంలో పిఆర్‌సి అమలు చేయడంతోపాటు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పనికి తగ్గ వేతనం కల్పించి, అంగన్వాడీలకు తెలంగాణ రాష్ట్రం కంటె వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామని వైసిపి తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నదన్నారు. జగన్ మాటలను వారు ఒట్టు తీశారన్నారు. రాష్ట్రంలో దాదాపు 2 లక్షల 50 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులున్నారన్నారు. కంటి తుడుపు చర్యగా 10,117 మందిని మాత్రమే రెగ్యులరైజ్ చేయడం దుర్మార్గమన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని తులసిరెడ్డి కోరారు.

టిడిపికి ప్రజల్లో సానుకూల స్పందన

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో టిడిపికి ప్రజల్లో సానుకూల స్పందన వచ్చిందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షకు గురువారం ఆయన సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు ఇంటింటికీ వెళితే.. ప్రజలు గో బ్యాక్ అనే నినాదాలతో వారు వెనుదిరిగి వస్తున్నారన్నారు. ప్రజలతో ఉన్న తమ నాయకుడిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని ప్రజల్లో స్పందన వచ్చిందన్నారు. దీక్షలో తెలుగు యువత, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు కూర్చున్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహోపకరణాలు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

షహీద్ భగత్ సింగ్ త్యాగనిరతి, భరత జాతి చరిత్ర ఉన్నంత వరకు చిరస్మరణీయంగా ఉంటుందని , ఆయన చూపిన తెగువ, పట్టుదల, దేశభక్తి, పోరాట తత్వాన్ని నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ పేర్కొన్నారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ముద్దనూరు రోడ్డులోని విభిన్నప్రతిభావంతుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ, కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీనాథ్ నాయక్ పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం స్థానిక కెనరా బ్యాంకులో ఉద్యోగిగా పనిచేస్తున్న నల్లపురెడ్డిపల్లెకు చెందిన మూలి వెంకటరామిరెడ్డి అనే అంధుడు తోటి విభిన్నప్రతిభావంతులకు గృహోపకరణాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ నాయకులు , కార్యదర్శులు వేణు, అమీర్, హరికృష్ణ, బాషా పాల్గొన్నారు.

కుల వివక్ష చూపారంటూ ఎస్‌సిల నిరసన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని తిప్పలూరు గ్రామంలోని పెత్తందారులు ఎస్‌సి కాలనీవాసులపై కుల వివక్ష చూపుతున్నారంటూ ఎస్‌సిలు ఆరోపించారు. పెత్తందారులకు వ్యతిరేకంగా గురువారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఎస్‌సిలు ధర్నా నిర్వహించారు. నినాదాలు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ధర్నాను విరమింపజేశారు. అనంతరం డిఎస్‌పి నాగరాజు, తహశీల్దార్ నాగేశ్వరరావు, సిఐ ఈశ్వరయ్య, ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, కృష్ణంరాజు నాయక్ తిప్పలూరు గ్రామానికి చేరుకొని జరిగిన విషయంపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌సి కాలనీ వాసులు మాట్లాడుతూ ఆదివారం జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామోత్సవాన్ని తమ ఇళ్ల నుంచి వెళ్లనీయకుండా పెత్తందారులు అడ్డుకున్నారని ఆరోపించారు. ఎస్‌సి కాలనీలో పెళ్లిళ్లు, శుభకార్యాలకు మేళాన్ని నిర్వహించరాదని తెలిపినట్లు ఆరోపించారు. పెత్తందారులు మాట్లాడుతూ డ్రమ్స్, డీజేలతో అధిక శబ్దం చేసుకుంటూ ఎక్కువ సమయాన్ని ఒకే చోట గడుపుతూ ఉండడంతో పశువులు బెదురుతున్నాయని, ఇళ్లలోని చిన్న పిల్లలు శబ్దాన్ని భరించలేక ఇబ్బందులు పడ్డారని కాస్త త్వరగా వెళ్లండి అని చెప్పినట్లు తెలిపారు. కలెక్టర్ కూడా ఫిర్యాదు చేశారని పెత్తందారులు పేర్కొన్నారు. అనంతరం డిఎస్‌పి, తహశీల్దార్ రెండు కులాల పెద్ద వారిని పిలిపించి సర్ది చెప్పారు. ఇకమీదట గ్రామంలో ఎలాంటి కార్యక్రమాలు జరిగిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమస్యలు ఉత్పన్నమైతే పోలీసులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా, కలిసికట్టుగా జీవించాలని వారు సూచించారు.


గ్రామంలో విచారిస్తున్న తహశీల్దార్, డిఎస్‌పి

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - చెన్నూరు

ఖాదర్‌ఖాన్‌కొట్టాల్ గ్రామంలో వివాహిత గురువారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఎన్.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఖాదర్‌ఖాన్ కొట్టాల్‌లో నివాసముండే రాయపాటి సుబ్బలక్ష్మి(38) తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి అంబాభవానిపేట్ కాగా, దాదాపు 20 ఏళ్ల క్రితం ఖాదర్‌ఖాన్ కొట్టాల్‌కు చెందిన పెద్దిరాజుతో వివాహమైంది. వీరు బిడ్డల వసులు చేసుకుని జీవనం సాగించేవారు. భర్త ప్రతిరోజూ మద్యం సేవించి హింసించే వారని, ఆత్మహత్యకు కూడా తన భర్తను సమర్థించడంతో జీవితంపై విరక్తి చెంది సుబ్బలక్ష్మి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నలుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని వై.కొత్తపల్లె సమీపంలో జూదం ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు వై.కొత్తపల్లె సమీపంలోని కంపచెట్లలో దాడి చేశామన్నారు. వీరివద్ద నుంచి రూ.5,300 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లయితే తమ దృష్టికి తేవాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ భవనాలు.. ఆకతాయిలకు నిలయాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రజల అవసరార్థం నిర్మించిన ప్రభుత్వ భవనాలు పలుచోట్ల నిరుపయోగంగా ఉన్నాయి. ఈ భవనాలు ఆకతాయిలకు నిలయాలుగా మారాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వ భవనాలు ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలోని ప్రభుత్వ భవనాలు చాలా ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. కార్యాలయ భవనానికి ముఖద్వారం లేకపోవడంతో ఆకతాయిలు ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారు. మరికొన్ని చోట్ల ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతానికి గురయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ భవనాలకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


ఆకతాయిలకు అడ్డాగా పిడబ్ల్యుడి బంగ్లాలోని భవనం

భక్తిశ్రద్ధలతో మిలాదున్ నబీ ఉత్సవాలు


శాంతి కపోతాలను ఎగురవేస్తున్న ఆర్‌డిఒ, సిఐ, పీఠాధిపతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు చేస్తున్న మిలాదున్నబీ పండుగ శాంతియుత ర్యాలీ వైభవంగా జరిగింది. గురువారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని జామియా మసీదు వద్ద పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్ పాషా ఖాద్రి ఆధ్వర్యంలో జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు, అర్బన్ సిఐ సదాశివయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్ ముల్లా జానీ, కో-ఆప్షన్ సభ్యులు దఫేదార్ ఫయాజ్‌బాషా, ముస్లిం మైనారిటీ నాయకులు, గురువులు శాంతి కపోతాలను గాలిలోకి ఎగురవేసి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం జామియా మసీద్ పీఠాధిపతి ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ మెయిన్ బజార్, కూరగాయల మార్కెట్, పాత బస్టాండు, గాంధీ సర్కిల్, తాడిపత్రి రోడ్డు మీదుగా ఎంపిడిఒ కార్యాలయ రోడ్డు, సాయిరాం థియేటర్ మీదుగా పలగాడి వీధి, గూడు మస్తాన్ వలీ దర్గా వద్దకు చేరుకుంది. అనంతరం పీఠాధిపతి, గురువులు ప్రసంగించారు. ర్యాలీలో పెద్దలు, చిన్నారులు వేల సంఖ్యలో పాల్గొని ప్రవక్త నినాదాలు చేశారు.

అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రొద్దుటూరు : బక్రీదు సందర్భంగా గురువారం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన ర్యాలీ విజయవంతమైంది. ముస్లిం నాయకులు ముందువరుసలో నిలబడి ర్యాలీ ఆద్యంతం శాంతియుతంగా జరిపించారు. మైదుకూరు రోడ్డులోని నజీరుల్లా షాదిఖానా నుంచి ర్యాలీ బయల్దేరి లైట్‌పాలెం, వెదుర్లబజార్ మీదుగా అషారెషరీఫ్ వరకు కొన సాగింది. కార్యక్రమంలో అంజుమన్ అహ్లెఇస్లాం అధ్యక్షుడు బొల్లవరం బాషా, మాజీ అధ్యక్షుడు ముక్తియార్, మసీదుల ఇమాంలు, ముస్లిం పాల్గొన్నారు.

-ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడిచి పదిమందికి మేలు చేసే పనులు చేయాలని జమ్మలమడుగు ఆస్థాన ఏ కౌశియా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్ పీరా ఖాద్రి పేర్కొన్నారు. గురువారం ఉదయం మొహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా పట్టణంలోని ఆస్థాన ఏ గౌసియా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్ పీరా ఖాద్రి ఆధ్వర్యంలో ముస్లిం లు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేకు కట్ చేశారు. గౌసియా షాదీఖానాలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఆస్థాన ఏ గౌసియా దర్గాలో మొహమ్మద్ ప్రవక్త జ్ఞాపిక చిహ్నాలను ప్రదర్శించారు.

ఖాజీపేట : మిలాద్ ఉన్ నబీ సందర్భంగా గురువారం ముస్లింలు ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో శాంతియూత ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. సమాజాన్ని శాంతి వైపు నడిపించిన దివ్య చరితుడు మహమ్మద్ ప్రవక్త అని వారు భక్తిశ్రద్ధలతో కొనియాడారు.


టిడిపి పరిస్థితి అధ్వానం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్రంలో టిడిపి పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సహకారంతో కాలం గడుపుతోందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మైదుకూరు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ వెనుక టిడిపి నాయకులు నడిచే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్టీఆర్ స్థాపించిన టిడిపిని చంద్రబాబు అవినీతితో భూస్థాపితం చేసే పరిస్థితికి తీసుకొచ్చారని ఆయన విమర్శించారు. 2024 ఎన్నికల నాటికి టిడిపి కనుమరుగవుతుందన్నారు. రాష్ట్రంలో కొన్ని అసెంబ్లీ స్థానాలకు టిడిపి అభ్యర్థులు దొరికే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబుపై అనేక కేసులలో వారెంట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. త్వరలో లోకేష్ కూడా అరెస్టు అయ్యే పరిస్థితి కనపడుతోందన్నారు. నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధితో రాబోయే ఎన్నికలకు ప్రజల వద్దకు వెళుతున్నామన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీతోపాటు చెప్పని వాటిని కూడా వైఎస్ జగన్ అమలు చేశారన్నారు. సమావేశంలో వైసిపి సమన్వయకర్త నాగిరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా మంజూరు పత్రాలు పంపిణీ

ఎన్.ఎర్రబల్లె సచివాలయం పరిధిలో గత 2 నెలల క్రితం ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భూమిరెడ్డి రఘురామిరెడ్డి, అంబటి జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు గురువారం మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లె రఘురామిరెడ్డి వైఎస్ఆర్ బీమా మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు రఘురామిరెడ్డి, ఎర్రబల్లె ఎంపిటిసి పెద్దిరెడ్డి లక్ష్మిదేవి, సచివాలయం కన్వీనర్ దశరథ రామిరెడ్డి, గృహసారధి చుక్కా గంగులయ్య, సచివవాలయ సిబ్బంది గౌస్ లాజం, నాయకులు పాల్గొన్నారు.


బీమా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

అందరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : 'రాచమల్లు'


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్రంలో ప్రజలంతా ఆరోగ్యంగా సుభిక్షంగా ఉండడమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని, ఆ ఉద్దేశంతోనే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలుచేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం కార్యక్రమంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిదేవి ఆరోగ్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పేదలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనారోగ్య లక్షణాలు ఉన్నాయా అని పరీక్షించి, అవసరమైన చికిత్స కూడా అందిస్తారన్నారు. ఇలాంటి కార్యక్రమం గతంలో మనం చూడలేదన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30 నుండి నెల రోజులపాటు జరుగుతుందన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా జీవించాలని రాచమల్లు కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, ఆరోగ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ సూచించారు. 4వ వార్డు సీయోనుపురంలో మూడో సచివాలయం ఆధ్వర్యంలో గురువారం హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఎన్‌ఎంలు చంద్ర, కళావతి, వార్డు కౌన్సిలర్ పార్న పల్లె కిషోర్, వాలంటీర్ ప్రతి ఇంటికెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా రక్త పరీక్ష, షుగర్, బీపీ, జ్వరాలుపై ఆరా తీశారు. షుగర్, జ్వరం ఉన్నవారి రక్తం సేకరించి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ పార్లపల్లి కిషోర్ పర్యవేక్షించారు. అనంతరం ఆయన రక్త పరీక్ష చేయించుకున్నారు.

పులివెందుల టౌన్ : సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇంటి వద్దనే వైద్యం అందాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, వార్డు సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని రేగడపల్లి పంచాయతీలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ సెంటర్‌ను గురువారం జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రజాసేవకుడు, రైతు పక్షపాతి అని తెలియజేయడానికి ప్రతి గ్రామ పంచాయతీలోనూ విలేజ్ క్లినిక్ పేరుతో గ్రామీణ వైద్యశాలలు ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు సరైన వైద్యాన్ని అందజేస్తున్నారని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండేలా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, పంటలను గుర్తించేందుకు ఇ క్రాప్ నమోదు నిర్వహిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ నిర్మలానందరెడ్డి, వెంకటాపురం మధుసూదన్‌రెడ్డి, కోడూరు రామసుబ్బారెడ్డి, రాజనర్సింహారెడ్డి, కె.పెద్దిరెడ్డి, తిమ్మాపురం శేఖర్, అధికారులు, వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చలో విజయవాడకు తరలిరండి

ప్రజాశక్తి - చాపాడు

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 30న చలో విజయవాడ చేపట్టామని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆ మేరకు గురువారం చలో విజయవాడ పోస్టర్స్ మైదుకూరు పట్టణంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని అన్ని జిల్లా కేంద్రాల్లో చలో కలెక్టరేట్‌లు నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు చేత విద్యార్థి సంఘ నాయకులను, విద్యార్థులను బలవంతంగా అరెస్టు చేసిందన్నారు. అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు విద్యార్థులకు అండగా ఉంటానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పూర్తిగా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగచరణ్, హరి నాయక్, చందు, శ్రీనివాసుల నాయక్, కాశీ పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాల వేలం రేపు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైఎస్ఆర్ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో స్టేషన్, పులివెందుల స్టేషన్ పరిధిలో నాటుసారా కేసులో పట్టుబడిన వాహనాన్ని ఈనెల 30న ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు సిఐ రామాంజనేయులు తెలిపారు. వాహనం దక్కించుకున్న వ్యక్తి పాడిన వేలం పాట డబ్బులతోపాటు జిఎస్‌టి కూడా చెల్లించవలసి ఉంటుందన్నారు. వివరాలకు ఎన్ ఫోర్సుమెంట్ ఇన్‌స్పెక్టర్, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో స్టేషన్ పులివెందులలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

మూగజీవాల పట్ల సేవాభావం ఉండడం హర్షణీయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మూగజీవాల పట్ల సేవాభావం కలిగి ఉండడం హర్షణీయమని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య అన్నారు. ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సహదేవ అనిమల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక జీవనజ్యోతి ఉన్నత పాఠశాలలో పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పద్మశాలి అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి మాట్లాడుతూ రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించడం, ఉచితంగా టీకాలు వేయడం శుభపరిణామమన్నారు. జీవనజ్యోతి విద్యాసంస్థల అధినేత గురుదేవ్ రామిరెడ్డి మాట్లాడుతూ భూతదయ కలిగి ఉండడం నిర్వాహకుల దార్శనికతకు నిదర్శనమన్నారు. డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ రేబిస్ దినోత్సవ నేపథ్యం చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో స్థానిక స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు గలాకల లక్షణ్‌కుమార్, బి.మధుసూధన్‌రెడ్డి, సతీష్‌కుమార్, డాక్టర్ విజయకుమార్, మానవత సంస్థ సభ్యులు కళావతి, భాగ్యలక్ష్మి, పశువైద్య విద్యార్థులు జి.గిరి, వై.గోపాలకృష్ణ, కె.మహేష్, సి.భరత్ పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

కొండాపురం : రైతులు ఈనెల 30లోగా ఇ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఎం రామాంజులరెడ్డి తెలిపారు. రైతులు తామ సాగు చేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. అలా చేసుకోని వారికి ఎలాంటి ప్రభుత్వ సహాయాలు అందవని తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో ఇకెవైసి చేయించుకోవాలన్నారు.

సాహితీ లోకానికి నవయుగ చక్రవర్తి జాషువా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తెలుగు సాహితీలోకానికి గుర్రం జాషువా నవయుగ చక్ర వర్తిలాంటివాడని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవా ధ్యక్షులు ఒంటేరు శ్రీనివా సులరెడ్డి అన్నారు. స్థానిక ఉపాధ్యా సేవా కేంద్రంలో గురువారం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న అసమానతలు, కులవివక్షకు వ్యతిరేకంగా జాషువా చేసిన రచనలు మేల్కొలుపుగా ఉన్నాయన్నారు. బాల్యం నుంచే పేదరికం, కులవివక్ష వంటి సమస్యలు వెంటాడుతున్నా మొక్కవోని దీక్షతో వాటిని ఎదురొడ్డి ఒక గొప్ప కవిగా తనను తాను మలచుకున్న మహనీయుడని చెప్పారు. రచయిత సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జాషువా రచనలు సమాజిక చైతన్యానికి దోహదపడ్డాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య, భోగా గంగాధర్, మధు, బాబా పాల్గొన్నారు.


జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

స్వాతంత్ర్య ఉద్యమ వేగుచుక్క భగత్‌సింగ్ : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వేగుచుక్క స్వాతంత్ర ఉద్యమ సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ అని డివైఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు ఎస్ షాకీర్, డి.ఎం. ఓబులేసు, లక్ష్య అకాడమీ డైరెక్టర్ పోలిరెడ్డి నగర ఉపాధ్యక్షులు విజయ్ కొనియాడారు. గురువారం డివైఎఫ్ఐ అధ్వర్యంలో లక్ష్య అకాడమీ లో భగత్ సింగ్ 116 వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట సమరయోధులు 23 సంవత్సరాల వయసులోనే దేశ స్వాతంత్ర విముక్తి కోసం బ్రిటిష్ వారితో పోరాడాలని తెలిపారు. భగత్ సింగ్ స్ఫూర్తితో మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. దేశంలో యువతీ యువకులు సైదాంతిక, రాజకీయ అధ్యయనం చేయాలని, మహనీయుల త్యాగాలను స్ఫూర్తి బాటలో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.ఆర్ట్సకళాశాలలో.. **కడప :** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవం వర్ధిల్లాలి నినాద సృష్టికర్త, యువతకు స్ఫూర్తి అయిన యువ నాయకుడు అమర వీరుడు భగత్ సింగ్ అని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి రవీంద్రనాథ్ అన్నారు. గురువారం ప్రభుత్వ పురుషుల కళాశాలలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఎన్‌సిసి క్యాడెట్లచే ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాద దాస్య శృంఖలాల నుండి భారతదేశాన్ని విముక్తం చేయడానికి 23 సంవత్సరాల ప్రాయంలో తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించిన పరమ దేశభక్తుడు, విప్లవ యోధుడు భగత్‌సింగ్ అని అన్నారు. ఆయన అడుగుజాడలో నేటి యువత నడవాలని, అదే మనమిచ్చే నిజమైన ఘన నివాళులన్నారు. ఎన్.సి.సి అధికారి లెఫ్టినెంట్ మహేష్, క్యాడెట్లు పాల్గొన్నారు.

బద్వేలు : భగత్ సింగ్ నేటి యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య కాలనీలో, ఆర్‌టిసి బస్టాండ్ వద్దనున్న విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె మస్తాన్ షరీఫ్, గంగనపల్లి నాగార్జున, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, సహాయ కార్యదర్శి బాల గురయ్యా, ట్రెజరర్ సురేంద్ర, పట్టణ నాయకులు యువరాజ్ ,నరసింహ ,రాయప్ప, తరుణ్, శ్రీనివాసులు, మస్తాన్, డివైఎఫ్ఐ మహిళ నాయకులు పద్మ, శిరీష, వెన్నెల, పట్టణ నాయకులు వేగన్, రషీద్, ఫిరోజ్, మనోజ్, నవీన్, డివైఎఫ్ఐ కార్యకర్తలు పాల్గొన్నారు. **చాపాడు :** బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వేగుచుక్క స్వాతంత్ర ఉద్యమ సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ అని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్‌కుమార్ కొనియాడారు. ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో మైదుకూరు పట్టణంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర పోరాట సమరయోధులు 23 సంవత్సరాల చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్య విముక్తి కోసం బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన భగత్ సింగ్ అని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** నేటి యువతకు భగత్‌సింగ్ స్ఫూర్తి అని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు తెలిపారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక సురక్ష బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్‌రెడ్డి, డాక్టర్ చక్రధర్ రక్తదాన శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ రక్తదానం చేయండి-ప్రాణదాతలు కండిఅని పిలుపునిచ్చారు. రక్తం ఇవ్వడంలో యువత ముందుకు రావాలన్నారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజ్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ పట్టణంలో ఎవరికైనా రక్తం అవసరమైతే 95024 94474ను సంప్రదించాలన్నారు. రక్తదాన శిబిరంలో గురు రాఘవేంద్ర, ఓపెన్ స్టడీ ప్రిన్సిపల్ సురేష్, ప్రదీప్ హేమంత్, మోహన్, భాస్కర్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, యువతకు ఆదర్శమూర్తి షాహిద్ భగత్ సింగ్ స్ఫూర్తితో విభజన హామీలు అమలు కోసం పోరాటాలు సాగించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. భగత్ సింగ్ జయంతిని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాఘవ, సూరి, ఉదయ్, రాజు పాల్గొన్నారు. **వేంపల్లె :** భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్ సూచించారు. భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు గౌస్‌పీర్, పీరుబాషా, సిరాజ్, తాజ్ పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : రక్తదాన శిబిరంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, జెవివి నాయకులు